క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. రెడ్డిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపల్లె, యర్రపల్లె గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


గోగినేనివారిపాలెంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పొదిలి రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గాయత్రి సూచించారు. సోమవారం ఉప్పలపాడు పంచాయతీలోని గోగినేనివారిపాలెం హరిజన కాలనీలో వైద్య శిబిరం నిర్వహించారు. ఫీవర్ సర్వే అనంతరం పలువురికి మందులు అందజేశారు. పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించి, ఫాగింగ్ చేయించారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు, వైరల్ ఫీవర్లు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.ఏసోబు, సీహెచ్‌ఓ విజయలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ శేషగిరి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు జడల పిచ్చయానంద స్వామి ఆరాధన

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులోని కంభం రోడ్డులో ఉన్న జడల పిచ్చయానంద స్వామి ఆరాధన మహోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమానికి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం మహిళా అధ్యక్షురాలు వి.శ్యామలా మల్లికార్జున్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కె.పార్వతమ్మ, ఒంగోలు అమృత హాస్పిటల్ కార్డియాలజిస్టు వి.కేశవ్‌తోపాటు పలువురు హాజరవుతారని తెలిపారు.

నేత్రాల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌రెడ్డి

రాచర్ల: నేత్ర సంబంధిత వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలని గిద్దలూరు పట్టణానికి చెందిన నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ జీకే మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేత్ర సమస్యలుంటే ఆలస్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మేరి మంజుల, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయం కోసం వృద్ధ దంపతుల ధర్నా


దీక్ష చేస్తున్న వృద్ధ దంపతులు

మార్కాపురం టౌన్:

తమకు న్యాయం చేయాలని మార్కాపురం మండలం రాయవరం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. రాయవరం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి పెద్దన్న మాట్లాడుతూ.. తాను, తన కుమార్తె లక్ష్మీదేవి, రాజేశ్వరి మరో ముగ్గురు కలిసి కాంట్రాక్టు పనిచేశామన్నారు. తమకు మార్కాపురం పట్టణానికి చెందిన ప్రసాద్ తదితరుల నుంచి సుమారు 2,52,608 రూపాయలు రావాల్సి ఉందని చెప్పారు. 2002 నుంచి 2025 వరకు రావాల్సిన వేతనం ఇవ్వలేదని, ఒక రూపాయి వడ్డీతో లెక్కవేసుకుంటే తమకు మొత్తం 41,00,608 రూపాయలు చెల్లించాల్సి ఉందని వివరించారు. ఇంత వరకు తమకు న్యాయం జరగలేదని, దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో నిరాహార దీక్ష చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయకుంటే ఆమరణ దీక్షకు కూర్చుంటామని తెలిపారు.

సైబర్ క్రైంపై అవగాహన కలిగి ఉండాలి

దర్శి: సైబర్ క్రైంపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని నేషనల్ సెక్యూరిటీ కౌన్సిలర్ కే ప్రదీప్ కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ క్రైంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ సైబర్ మోసాలు ఎలా జరుగుతాయి, అలా జరగకుండా విద్యార్థులు ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో వివరించారు. సైబర్ నేరగాళ్లు ఎలా మోసం చేస్తారో విద్యార్థులతో ప్రాక్టికల్‌గా చూపించారు. సాధారణంగా సైబర్ నేరగాళ్లు మన మొబైల్‌కి లింకులు, ఓటీపీలు పంపడం ద్వారా హాకింగ్ చేసే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమానికి కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే ప్రభుదాస్, అధ్యాపకులు నగేష్, రవీంద్ర, వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.

- కొమరోలులో డ్రెయినేజీని తవ్వి పనులు ఆపేసిన వైనం
- భారీ గోతులతో ఇబ్బంది పడుతున్న స్థానికులు
- కంభంలో రోడ్లపైనే ప్రవహిస్తున్న మురుగు

అస్తవ్యస్తంగా డ్రెయిన్ల నిర్వహణ


కొమరోలు : ఓ ఇంటి ముందు కూలిపోయిన సైడు కాలువ రివిట్‌మెంట్


కొమరోలు : సైడు కాలువలను తవ్వడంతో ఏర్పడిన భారీ గుంతలు


సైడు కాలువ తవ్వడంతో కర్రల వంతెనపై ఇంట్లోకి వెళ్తున్న వ్యక్తి

కొమరోలు: డ్రెయినేజీల్లో మురుగు సక్రమంగా ప్రవహించడం లేదని ఏడాదిగా ప్రజలు మొరపెట్టుకుంటుంటే ఆలస్యంగా స్పందించిన పాలకులు.. ప్రారంభించిన పనులను సైతం అర్ధంతరంగా నిలిపేశారు. దీంతో మురుగు సమస్య తీరకపోగా కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. కొమరోలులోని గోపాలునిపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో చిన్నపాటి వర్షానికి సైతం సైడు కాలువలు నిండి మురుగు మొత్తం బీసీ కాలనీకి వెళ్లే రహదారిలో గృహాల్లోకి చేరుతోంది. ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు గత కొద్దినెలలుగా అధికారులకు మొరపెట్టుకున్నారు. దీంతో కొమరోలు గ్రామ పంచాయతీ సిబ్బంది జేసీబీతో సైడు కాలువలు తవ్వించారు. దుకాణాలు, ఇళ్ల ముందు ఉన్న మెట్లను సైతం పెకలించారు. దాదాపు 20 రోజుల క్రితం మొదలుపెట్టిన ఈ పనులు ఓ పట్టాన కొలిక్కి రాకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గోపాలునిపల్లె రహదారి ప్రాంతంలో పాఠశాలలు, కళాశాలలు ఉండటంతో ఆ సైడు కాలువల్లో విద్యార్థులు పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సైడు కాలువల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యపై గ్రామ సచివాలయం-1 పంచాయతీ కార్యదర్శి బ్రహ్మయ్యను వివరణ కోరగా గ్రామ సర్పంచ్‌కు తెలియజేసి పరిష్కరిస్తామని తెలిపారు.


కంభం : కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలు


కంభంలో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగు

రోడ్లపైన మురుగు తాండవం

కంభం: పట్టణంలో పలుచోట్ల కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో మురుగు మొత్తం రోడ్లపై ప్రవహిస్తోంది. ఇటీవల కాలంలో ఇరిగేషన్ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. అందులో భాగంగా స్టార్ సినిమాహాలు పక్క లైనులో ఉన్న పంట కాల్వల్లోని మురుగు తొలగించారు. కొన్ని చోట్ల డ్రైనేజీ ఆక్రమణలకు గురై కుంచించుకు పోయింది. ఈ నేపథ్యంలో పైనుంచి వచ్చే మురుగు ముందుకు వెళ్లే దారిలేక రోడ్లపైకి చేరుతోంది. ఇరిగేషన్ కాలువల్లో వ్యర్థాలు పడేస్తుండటం, డ్రైనేజీ పైపులు ఇరిగేషన్ కాల్వల్లోకి వదిలేయడంతో అవన్నీ కొట్టుకొచ్చి రోడ్డుకు సమీపంలో ఉన్న కాల్వ మలుపు వద్ద నిలిచిపోతున్నాయి. మురుగంతా స్టేట్‌బ్యాంక్ ఎదురుగా ప్రవహిస్తుండటం.. ఆ మార్గంలో బస్సులు, ఇతర వాహనాలు తిరిగే సమయంలో పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. తీవ్ర దుర్వాసన వస్తుండటంతోపాటు దోమల బెడద పెరిగిపోతుందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి కాల్వలపై ఉన్న ఆక్రమణలు తొలగించి మురుగు ముందుకు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముస్లిం కమిటీ యూత్ దాతృత్వం


ముస్లిం యువతికి అందజేసిన వస్తువులు

కంభం: స్థానిక అర్బన్ కాలనీలో పేద ముస్లిం యువతి వివాహానికి కంభం ముస్లిం యూత్ కమిటీ సభ్యులు సహకారం అందించారు. పేద ముస్లిం యువతి వివాహ విషయం తెలుసుకున్న కమిటీ సభ్యులు తమ వంతు సాయంగా మంచం, బీరువా, డ్రెస్సింగ్ టేబుల్, సుమారు 60 వేలు విలువచేసే సామగ్రిని అందజేసి దాతృత్వం చాటుకున్నారు. వివాహం సందర్భంగా వధువు కుటుంబ సభ్యులు ఇవ్వాల్సిన సామగ్రిని అందించిన దాతలను కాలనీ వాసులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భగా ముస్లింట్ యూత్ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఓర్పు నేర్పుతో విజయం తథ్యం

- బ్రహ్మంగారి మఠం అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామి



మాట్లాడుతున్న పీఠాధిపతి విరజానంద స్వామి

మార్కాపురం: ఓర్పు నేర్పుతో విజయం సిద్ధిస్తుందని వైఎస్సార్ కడప జిల్లా బ్రహ్మంగారి మఠంలోని ఆచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామి పేర్కొన్నారు. స్థానిక జార్జి ఇంజినీరింగ్ అటానమస్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తరగతి గది అనేది జ్ఞానాన్ని పురుడుపోసుకునే ప్రసూతి మందిరమని, అజ్ఞానాన్ని ఖననం చేసే శ్మశానమని అభివర్ణించారు. సమాజానికి అవసరమైన అన్ని నిర్మాణాలను తయారు చేసేది తరగతి గది అని పేర్కొన్నారు. తొలుత ఆయన కళాశాలలోని గణపతి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ రాజబాబు, డీన్ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలతో ఆర్థిక నష్టాలు

మార్కాపురం:

మూఢ నమ్మకాలను ప్రజలు విడనాడాలని జన విజ్ఞాన వేదిక సమత కన్వీనర్ ఆర్ఎం రుహానీస్పాల్ పేర్కొన్నారు. సోమవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక సీతారామశాస్త్రి వైద్యశాలలో ఏరియా కమిటీ సమావేశం ఆరోగ్య కన్వీనర్ డాక్టర్ బి.శరత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రుహానీస్పాల్ మాట్లాడుతూ.. ఆర్థిక నష్టాలకు గురిచేసే మూఢ నమ్మకాలను సమాజం నుంచి పారదోలేందుకు విద్యావంతులు కృషి చేయాలన్నారు. డాక్టర్ శరత్ మాట్లాడుతూ.. ప్రజలు సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు యు.వెంకట్రావు, జిల్లా కార్యదర్శి ఏనుగుల రవికుమార్, నాయకులు ఆర్.విప్లవ కుమార్, కె.చంద్రశేఖరయ్య, లఘుమారపు మురళీకృష్ణ, గుండాల ముక్తేశ్వరరావు, మర్రిపూడి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రుహానీస్పాల్

నాయుడుపేటలో వైద్యశిబిరం

సాక్షి ఎఫెక్ట్..


ఎస్సీ కాలనీలో జ్వరంతో బాధపడుతున్న వృద్ధురాలిని పరీక్షిస్తున్న డాక్టర్ బాలయ్య

కొనకనమిట్ల: మండలంలోని నాయుడుపేట గ్రామంలో సోమవారం గొట్లగట్టు పీహెచ్‌సీ డాక్టర్ ఎస్వీ బాలయ్య ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామాల్లో వైరల్ జ్వరాలు ప్రబలుతుండటంపై ఈ నెల 5న 'జ్వర పీడితం.. ప్రాణ భయకంపితం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. జ్వరాల బాధితులు అధికంగా ఉన్న గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం నాయుడుపేటలో జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేయడంతో పాటు మందులు అందజేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ నారాయణ రెడ్డి, ఎంపీహెచ్‌ఎస్ జె.వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు కెతూర, జ్యోతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు ఇవ్వాలని వినతి


ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న మహిళలు

కంభం: తమకు ఇస్తామన్న కుట్టుమిషన్లు వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు మహిళలు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో 6 నెలల క్రితం మండలంలోని 142 మంది మహిళలకు సుమారు 4 నెలల పాటు శిక్షణ ఇచ్చారని, ఆగస్టులో కుట్టుమిషన్లు ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదని వివరించారు.

ఏజెన్సీ వారికి ఫోన్ చేసినా స్పందించడం లేదని మహిళలు వాపోయారు. అధికారులు స్పందించి కుట్టు మిషన్లు త్వరగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కూటమి ప్రభుత్వంలో రైతులకు కష్టాలు.. కన్నీళ్లు


అన్నదాత పోరు వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అన్నా రాంబాబు, పార్టీ నాయకులు

- రైతులకు సక్రమంగా ఎరువులు, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడంలో సర్కారు విఫలం
- నేడు రైతులకు మద్దతుగా మార్కాపురంలో 'అన్నదాత పోరు'
- పోస్టర్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు రైతులకు స్వర్ణయుగమని స్పష్టీకరణ

మార్కాపురం: ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించడంపై నిరసన తెలుపుతూ, యూరియా కొరతతో ఇబ్బంది పడుతున్న రైతన్నలకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. రైతులకు సరిపడా ఎరువులను అందించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేయడంతోపాటు సబ్‌కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. సోమవారం మార్కాపురంలోని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, మున్సిపల్ నాయకులు కార్యకర్తలతో కలిసి ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాతపోరు వాల్‌పోస్టర్‌ను అన్నా రాంబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు పంపిణీ చేయడంతోపాటు ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం, వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని అందించి నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుండటంతో ఎరువుల కోసం రైతులు రోడ్డెక్కాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద కేంద్రంతో సంబంధం లేకుండా ఏటా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు గత నెలలో ఎంతిచ్చారో రైతులు గమనించాలని కోరారు. పెట్టుబడి సాయం గత ఏడాది ఎగ్గొట్టి రైతులను వంచించారని, పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో అన్నదాతలు ఆర్థికంగా చితికిపోయారన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టబోయే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల ఎంపీపీలు లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ సభ్యులు నారు బాపన్‌రెడ్డి, అక్కిదాసరి ఏడుకొండలు, ఏపీ పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యులు వెన్న హనుమారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, మార్కాపురం పట్టణ, రూరల్, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండల పార్టీల అధ్యక్షుడు సలీమ్, చెంచిరెడ్డి, మురారి వెంకటేశ్వర్లు, మోరా శంకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి గొలమారి సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు గాయం శ్రీనివాసరెడ్డి, బట్టగిరి తిరుపతిరెడ్డి, తర్లుపాడు మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు సిరాజ్, వార్డు ఇన్‌చార్జిలు ఉత్తమ్‌కుమార్, రోజ్‌లిడియా, అమీరుల్లాఖాన్, వరమ్మ, జి.చెన్నారెడ్డి, కాశీరాంసింగ్, గుంటక చెన్నారెడ్డి, బొగ్గరపు శేషయ్య, దాసరి వెంకటేశ్వర్లు, ఉస్మాన్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

మార్కాపురం: రైతన్నలకు అండగా ఎరువుల బ్లాక్‌మార్కెట్‌పై అన్నదాత పోరు కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ కార్యాలయ ప్రతినిధి తెలిపారు. పాతబస్టాండులోని గడియార స్తంభం వద్ద గల డాక్టర్ వైఎస్సార్ విగ్రహం నుంచి ర్యాలీగా బయలుదేరి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో మార్కాపురం, గిద్దలూరు పార్టీ ఇన్‌చార్జిలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొంటారని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

యూరియా కొరత నివారించాలి

- ధర్నాలో సీపీఐ నేతల డిమాండ్


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

మార్కాపురం: యూరియా కొరతను నివారించాలని, బ్లాక్‌మార్కెట్‌కు ఎరువులు తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు అందె నాసరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ, ఏపీ రైతు సంఘం, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మార్కాపురంలో ధర్నా నిర్వహించి సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాసరయ్య మాట్లాడుతూ.. నెల రోజులుగా రాష్ట్రంలో యూరియా, డీఏపీ కొరత కారణంగా రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. షాపుల వద్ద లైన్లలో బారులు తీరినా ఎరువులు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. బ్లాక్ మార్కెట్ దారులు అక్రమంగా ఎరువులు నిల్వచేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నా ప్రభుత్వం చోద్యం చూడటం దారుణమన్నారు. యూరియా, డీఏపీ తదితర ఎరువులను రైతులకు సరిపడా సబ్సిడీ ధరకు అందించాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నానో యూరియాతో సంబంధం లేకుండా యూరియాను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు ఖాశీం, కార్యకర్తలు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో నిర్లక్ష్యం


చింతలపల్లె సమీపంలో ఒరిగిన నూతన విద్యుత్ స్తంభం

కొమరోలు: ఆర్‌డీఎస్ఎస్ విద్యుత్ లైన్ పనులపై ఆ శాఖ అధికారుల పర్యవేక్షణ కరువైంది. విద్యుత్ స్తంభాలను సక్రమంగా పాతకపోవడంతో నెల రోజులు గడవకముందే అవి ఒరిగిపోతున్నాయి. కొమరోలు నుంచి చింతలపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో చిన్నచెరువు కట్ట సమీపంలో విద్యుత్ స్తంభం పూర్తిగా ఒక వైపునకు ఒరిగింది. పనులు చేస్తున్న సమయంలోనే విద్యుత్ స్తంభాలు ఒరిగిపోతుంటే.. దశాబ్దాలపాటు ఈ స్తంభాలు నిలకడగా ఉంటాయా అని ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. పనులను కాంట్రాక్టర్ హడావిడిగా పూర్తి చేసి మమ అనిపించకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.